క్లుప్తంగా

గ్రూప్‌-1 ఉద్యోగికి సన్మానం



విష్ణునందన్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన పాత రమేశ్‌–కేసరి దంపతుల కుమారుడు విష్ణునందన్ గ్రూప్‌–1లో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించాడు. దీంతో అతన్ని దండేపల్లిలో ఆయన నివాసంలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు.

జన్నారంలో..



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జన్నారం: గ్రూప్‌–1లో డీఎస్పీగా ఉద్యోగం సాధించిన మండల కేంద్రానికి చెందిన అనిల్ కుమార్‌ను అతని తల్లి భాగ్యలక్ష్మిని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి, పట్టుదలతో చదివి గ్రూప్‌–2, 3, 4లో సెలెక్ట్ అయి, ఇటీవల గ్రూప్ 1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎంలు సుధాకర్, మధుసూదన్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సత్తన్న, నర్సయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



వేమనపల్లి: మండలకేంద్రంలోని ఎంచపాయ రహదారి వెంట ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఓ చేను వద్ద టేకుచెట్టు కొమ్మలను విద్యుత్ తీగలు తాకుతున్నాయి. ఈ విద్యుత్ లైన్‌కు సరఫరా అవుతుండడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామంలో మాల కాలనీలో గురువారం బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఒకే చోట వద్ద పెట్టి ఆడిపాడారు. అనంతరం వాగులో నిమజ్జనం చేశారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని బెస్తవాడలో గంగమాతా నవరాత్రులను పురస్కరించుకుని శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించనున్న ఈ పోటీలలో 32 జట్లు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లచ్చయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు రాంచందర్, గాలిమధు, కిష్టయ్య, మోర్లరమేష్ నాయకులు సాయి, సంతోష్‌కుమార్, జాయేద్ అలీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

భజన కమిటీ ఎన్నిక



ఎన్నికైన భజన కమిటీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలో శుక్రవారం శ్రీమన్నారాయణ భజన మండలి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోదరి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా నరిగె కిష్టయ్య, సెక్రెటరీగా నరిగె రాజబాపు, సలహాదారుగా చంటి కుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు దేశ్‌ముఖ్ పాండే ఆదేశాలతో జిల్లా అధ్యక్షుడు వెంకటాచార్యులు, సెక్రెటరీ రమేశ్‌చారి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

ఊరూరా దసరా వేడుకలు



బెల్లంపల్లి: క్యాంపు కార్యాలయ ఆవరణలో జమ్మిచెట్టుకు శమీపూజ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి/దండేపల్లి/జన్నారం/లక్సెట్టిపేట/వేమనపల్లి/నెన్నెల/తాండూర్/చెన్నూర్/కాసిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్‌రూరల్/కోటపల్లి/భీమిని/నస్పూర్/రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్/భీమారం/జైపూర్: దసరా పర్వదినం పురస్కరించుకొని జిల్లాలో గురువారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శమీ, వాహనపూజలతో సందడి నెలకొంది. వేడుకల్లో భాగంగా జమ్మి చెట్టుకు పూజలు అనంతరం ఒకరికొకరు జమ్మి ఆకుతో ఆలింగనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, బంధులకు జమ్మి ఆకు అందజేసి అలాయ్‌బలాయ్ తీసుకుని ఆశీర్వాదం పొందారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయ ఆవరణలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ జమ్మి చెట్టుకు శమీ పూజ చేశారు. వేద పండితుడు మంత్రోచ్చరణలు మధ్య పూజలు చేయించారు. విజయ దశమి పర్వదినం ప్రజలందరికి శుభ విజయాలు కలిగించాలని ఆకాంక్షించారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఆయుధ పూజ చేశారు. గోవింద క్షేత్రం ఆవరణలో శమీ పూజలో కమాండెంట్ వెంకటరాములు–పద్మ దంపతులు పాల్గొన్నారు. తర్వాత బాణాన్ని సంధించి రావణ దహనం జరిపారు. అధికారులు, ఆర్‌ఐలు, సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజలతో పాటు స్టేషన్ వాహనాలకు పూజలు జరిపారు. తాండూర్ మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో దుర్గామాత శోభాయాత్ర, మహిళల కోలాటం నడుమ వైభవోపేతంగా కొనసాగింది. సింగరేణి మినీ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు బెల్లంపల్లి జీఎం విజయభాస్కర్‌రెడ్డి దంపతులు హాజరై శమీ పూజలు చేశారు. కార్మిక కుటుంబాలతో కొంతసేపు కాలక్షేపం చేశారు. కొత్తపల్లిలో అమ్మవారి శోభాయాత్రలో పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కిష్టంపేటలో రావణదహనం వైభవంగా సాగింది.



శ్రీరాంపూర్: ఆర్కే 6 గనిలో..



చెన్నూర్ దుర్గాదేవి ఆలయం వద్ద..



కాసిపేట: పెద్దనపల్లిలో జమ్మిచెట్టు వద్ద..



కన్నెపల్లిలో..



వేమనపల్లిలో జమ్మి చెట్టుకు పూజలు..



శమీ పూజలో జీఎం విజయభాస్కర్‌రెడ్డి దంపతులు



లక్సెట్టిపేట: పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ



కర్ణమామిడిలో దసరా వేడుకల్లో స్థానికులు



చెన్నూర్ మండలం ఆస్నాదలో..



కవ్వాల్‌లో శుభాకాంక్షలు తెలుపుతూ..



రామావుపేటలో జమ్మిచెట్టుకి పూజలు..



శమీ పూజలో కమాండెంట్ దంపతులు



శమీ పూజలో జీఎం రాధాకృష్ణ, అధికారులు



దండేపల్లిలో ర్యాలీగా జమ్మికి వెళ్తున్న గ్రామస్తులు



భీమారంలో రావణాసురుని దహనం



నస్పూర్‌లో..

■ బొగ్గుబాయి వార్తలు

కాసిపేట గనికి పూర్వవైభవం తీసుకురావాలి

- జీఎం రాధాకృష్ణ



కాసిపేట గనిపై జీఎం రాధాకృష్ణ, అధికారులు

కాసిపేట: కాసిపేట గని గతంలో ఎన్నో రికార్డులు సృష్టించిందని, ఉద్యోగులు గనికి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని జీఎం రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిలో అండర్‌గ్రౌండ్‌లో నూతనంగా అనుమతులు వచ్చిన 3 ఎస్‌–13, 4ఎస్‌–13 డిస్ట్రిక్‌ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పనులు పరిశీలించారు. సంస్థ నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అందరు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఉద్యోగుల్లో గైర్హాజరు శాతం ఎక్కువగా ఉందని సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. మందమర్రి గ్రూప్ ఏజెంటు డి.రాంబాబు, మేనేజర్ డి.సతీశ్, రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, డిప్యూటీ మేనేజర్ వెంకటేశ్, సర్వేయర్ ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

ఉత్పత్తి ఖర్చు తగ్గించాలి

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తి ఖర్చును మరింత తగ్గించుకోవాలని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా ముఖ్య అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. యంత్రాల పనిగంటలు మరింత పెరగాలని సూచించారు. నాణ్యమైన బొగ్గు రవాణా చేయాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. పర్యావరణ సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్సా, ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి ఏ.వెంకటేశ్వరరెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఇంజినీర్ సాంబశివరావు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్ డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్ కుమార్, రవీందర్ మల్లయ్య, ఏరియా రక్షణ అధికారి విజయకుమార్, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రావణాసుర వధ

- 20 వేల మందికి పైగా తరలివచ్చిన ప్రజలు
- కిక్కిరిసిన తిలక్ స్టేడియం



మంటల్లో కాలిపోతున్న రావణాసురుడి ప్రతిమ

బెల్లంపల్లి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లిలో గురువారం రాత్రి రావణాసుర వధ అట్టహాసంగా జరిగింది. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రమంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి వివేక్ మాట్లాడుతూ దసరా పండుగకు ఎంతో చరిత్ర ఉందన్నారు. అధర్మంపై ధర్మం విజయం సాధించిన రోజుగా పురాణా ఇతిహాసాల్లో ఉందన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో దసరా వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ఈ వేడుకలను ప్రజలు సంతోషంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన తాను ఇచ్చిన మాట తప్పనని స్పష్టం చేశారు. దీపావళి నాటికి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు నివేదిక రూపంలో తెలియజేస్తానని అన్నారు. కాగా, పట్టణప్రజలతోపాటు చుట్టుపక్కల నుంచి దాదాపు 20 వేల మందికి పైగా తరలివచ్చి రావణాసుర వధను వీక్షించారు. భక్తజన సందోహంతో సింగరేణి తిలక్‌స్టేడియం కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే గడ్డం వినోద్ రావణాసురుడి ప్రతిమకు ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్ చేసి నిప్పంటించారు. క్షణాల్లో ఆహుతైంది. అంతిమ ఘట్టానికి ముందు ప్రత్యేకంగా తయారు చేసిన మల్లె పందిరి, నాగుపాములు ఇతరాత్ర ఆకృతులను కాల్చి సభికులను రంజింపజేశారు. భారీగా బాణాసంచా కాల్చారు. అంతకుముందు బాలికలు నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే వినోద్ వారికి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.సూరిబాబు, మాజీ చైర్‌పర్సన్లు మునిమంద స్వరూప, జె.శ్వేత, పీసీసీ సభ్యుడు సీహెచ్.శంకర్, కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, నాయకులు మునిమంద రమేశ్, దావ రమేశ్, రాజలింగు, సన్నీబాబు, హిందూ ఉత్సవ సమితి నిర్వాహకులు నగేశ్, కోడి రమేశ్, బాల సంతోష్, ఏసీపీ ఎ.రవికుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహాత్మాగాంధీకి నివాళి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్



నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/లక్సెట్టిపేట/శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/జన్నారం: జిల్లాలో మహాత్మాగాంధీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ శాంతియుత పోరాటం ఎంతో గొప్పదని కొనియాడారు. టీపీసీసీ రాష్ట్ర ఎన్నికల ప్రచార కన్వీనర్ నాతరి స్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.మల్లయ్య పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, కాంగ్రెస్ నాయకులు నాయకులు పాల్గొన్నారు.
- మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో సిబ్బంది, టీఎన్జీవోస్ భవన్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు తిరుపతి, పబ్లిసిటీ సెక్రటరీ యూసఫ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్ పాల్గొన్నారు.



పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



శ్రీరాంపూర్: పూలమాల వేస్తున్న జీఎం శ్రీనివాస్

- శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జీఎం ఎం శ్రీనివాస్, ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, డీజీఎం పర్సనల్, అనిల్ కుమార్, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఐటీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. జీఎం కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవలో స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమాన్ని జీఎం ప్రారంభించారు.

ముగిసిన దేవీనవరాత్రి ఉత్సవాలు

- ఘనంగా నిమజ్జన శోభాయాత్ర



కన్నెపల్లిలో శోభాయాత్రలో భక్తులు



చెన్నూర్: నిమజ్జనానికి తరలివెళ్తున్న దుర్గామాత



కిష్టంపేటలో నృత్యం చేస్తున్న మహిళలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కోటపల్లి/భీమిని/చెన్నూర్/చెన్నూర్‌రూరల్/కాసిపేట/జన్నారం/బెల్లంపల్లిరూరల్/మందమర్రిరూరల్/జైపూర్/దండేపల్లి: జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. దుర్గామాత విగ్రహాలు ప్రతిష్ఠించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం, అన్నదాన కార్యక్రమాలు కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం చివరి రోజు విగ్రహాలను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. మహిళలు, యువతుల కోలాటాలతో నృత్యాలు చేస్తూ నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. ముల్కల్లలోని శ్రీవిజయదుర్గా సేవా సమితి మండపం, గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో దుర్గాదేవి విగ్రహాలను గుడిపేట గోదావరిలో నిమజ్జనం చేశారు. కోటపల్లి మండలం కొండంపేటలో నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. కన్నెపల్లి, భీమిని, బెల్లంపల్లి, జన్నారం, జైపూర్ మండలాల్లోని గ్రామాల్లో విగ్రహాలను గోదావరి, వాగులు, చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. చెన్నూర్ మండలంలోని ఎర్రాయిపేట గోదావరి నది, చెన్నూర్ పెద్ద చెరువు వద్ద రాత్రి వరకు నిమజ్జన శోభాయాత్ర కొనసాగింది. కాసిపేట మండలకేంద్రంతోపాటు సోమగూడెం, కోమటిచేను గ్రా మాలు, మందమర్రి మండలంలోని విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించి మంచిర్యాల గోదావరిలో నిమజ్జనానికి తరలించారు. దండేపల్లిలో అమ్మవారి విగ్రహాలను గూడెం గోదావరిలో నిమజ్జనం చేశారు.



గుడిపేట బెటాలియన్‌లో..



దండేపల్లిలో..



మందమర్రిరూరల్: నృత్యం చేస్తున్న మహిళలు

నేడు విద్యుత్ అంతరాయం

వేమనపల్లి/బెల్లంపల్లిరూరల్/చెన్నూర్‌రూరల్/దండేపల్లి/జైపూర్: చెన్నూర్ మండలం కిష్టంపేట నుంచి వేమనపల్లికి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతు కారణంగా శనివారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ దీక్షిత్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నీల్వాయి, వేమనపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- 33 కేవీ శివాలయం ఫీడర్‌లో పీఎంఐ లైన్ మరమ్మతు కారణంగా బుధాకుర్దు, బుధాకలాన్, చంద్రవెల్లి, చాకెపల్లి, లంబాడీతండా, గురిజాల, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, రంగపేట, దుగ్నెపల్లి గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా ఉండదని ఏఈ రాంమనోహర్ పేర్కొన్నారు.
- చెన్నూర్ మండలం కొమ్మెర ఫీడర్ పరిధిలోని కొమ్మెర, ఆస్నాద, పొక్కూరు, దుగ్నెపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం సరఫరా ఉండదని ఏఈ కేశొట్టి పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.
- లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు లక్సెట్టిపేట ఏడీఈ ప్రభాకర్‌రావు తెలిపారు.
- జైపూర్ మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల నుంచి జైపూర్ సబ్‌స్టేషన్ సరఫరా చేస్తున్న 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు నిమిత్తం సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రెస్‌క్లబ్ ప్రారంభం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో నూతన ప్రెస్‌క్లబ్‌ను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చెండే సత్యనారయణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, స్వామి, శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేశ్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.